క్లుప్తంగా

నేడు మహా ప్రత్యంగిరా హోమం

జగద్గిరిగుట్ట: శ్రీ మానస పరివార ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం అంజయ్యనగర్ మల్లికార్జున స్వామి ఆలయంలో మహా ప్రత్యంగిరా హోమం నిర్వహించనున్నారు. ఉదయం 9గంటలకు ఈ హోమం ప్రారంభమవుతుందన్నారు. హోమంలో పాల్గొనదలచిన వారు 8గంటలకు ఆలయానికి చేరుకోవాలని నిర్వాహకులు తెలిపారు. ప్రతినెల అమావాస్య రోజు జరగనున్న ఈ హోమం ఆ రోజు బతుకమ్మ పండగ ఉండటంతో శుక్రవారం నిర్వహిస్తున్నారు.

బతుకమ్మ కుంటలను శుభ్రం చేయాలి



సీసాల బస్తీలో ఉన్న బతుకమ్మకుంటను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: బతుకమ్మ పండగ నేపథ్యంలో డివిజన్ పరిధిలోని సీసాలబస్తీ, సోమయ్యనగర్, కూన మహాలక్ష్మినగర్ ఉన్న కుంటలను గురువారం కార్పొరేటర్ జగన్ పరిశీలించారు. వీలైనంత తొందరగా ఈ కుంటలను శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు.

15 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

కుత్బుల్లాపూర్: కొంపల్లి గ్రామంలోని దుర్గాదేవి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. 15న బాలత్రిపుర సుందరిగా, 16న గాయత్రిదేవిగా, 17న అన్నపూర్ణమాతగా, 18న మహాలక్ష్మిదేవిగా, 19న శ్రీమహాచండీమాతగా, 20న సరస్వతీ దేవిగా, 21న లలితా త్రిపుర సుందరీగా, 22న దుర్గామాతగా, 23న మహిషాసురమర్దిని, శ్రీరాజరాజేశ్వరి దేవిగా అలంకరించనున్నారు. 23వ తేదీ సాయంత్రం 6గంటలకు జెమ్మిపూజ, అపరాజిత దేవి పూజ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న కూన శ్రీశైలంగౌడ్

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి పంచశీల కాలనీలోని నాగదేవత అమ్మవారి ఆలయ ఐదో వార్షికోత్సవ మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచి నిర్వహించిన అభిషేకాలు, పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. బీజేపీ నాయకులు నందనం దివాకర్, రమణారెడ్డి, మోతె శ్రీనివాస్ యాదవ్, ఏర్వ వెంకటరమణ, బాలరాజు, రంగా శ్రీనివాస్‌గౌడ్, నాగేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో డచ్ ప్రతినిధి బృందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీని డచ్ ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. ఈ బృందం ఇంటర్నేషనల్ అఫైర్స్ ఆఫీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ సమన్వయం చేశారు. డచ్ భాష, భారతీయ విద్యాసంస్థల మధ్య బలమైన బంధాన్ని పెంపొందించే దిశగా ఈ సందర్శన ఉంది. ఈ పర్యటనలో భాగంగా సెంటర్ ఫర్ అప్లైడ్ లింగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషనల్ స్టడీస్ హెడ్ ప్రొఫెసర్ అరుల్‌మొళి, ప్రొఫెసర్ జీ ప్రభాకర్‌రావు, ఇంటర్నేషనల్ అఫైర్స్ ఆఫీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ చేతన శ్రీవాస్తవ, ఆఫీస్ ఫర్ ఇంటర్నేషనల్ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ అలోక్‌కుమార్ మిశ్రాతో సమావేశమయ్యారు. భారతదేశంలో డచ్ భాష, సంస్కృతిని ప్రోత్సహించడంలో ముఖ్యమైన మైలురాయిని గుర్తించడమే కాకుండా విద్య, భాష అధ్యయనాల రంగంలో అంతర్జాతీయ సహకారం పెంపొందించుకోవడమే ఈ పర్యటన లక్ష్యం.

భెల్ హౌసింగ్ సొసైటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

శేరిలింగంపల్లి: బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల నిర్వహణాధికారిగా నియమితులైన అసిస్టెంట్ రిజిస్ట్రార్ మాధవరెడ్డి గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 17 తేదీ నుంచి మూడు రోజుల పాటు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉంది. 20వ తేదీ నామినేషన్ల పరిశీలన, 21వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. 28వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు.

ఆగుతూ.. సాగుతూ.. మూడేళ్లు..

పురపాలికల్లో సమీకృత మార్కెట్లకు గ్రహణం

- మూడేళ్లుగా కొనసాగుతున్న నిర్మాణ పనులు
- 13 వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లకు రూ.39.90 కోట్లు
- 2022 సంక్రాంతి వరకు పూర్తి కావాల్సి ఉన్నా..
- నిధుల లేమితో నత్తనడకన సాగుతున్న పనులు



నిర్మాణంలోనే మార్కెట్ భవనం

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారు ప్రజలకు కనీస మౌలిక వసతుల కల్పనలో భాగంగా 13 పురపాలక సంఘాల్లో రెండేళ్ల క్రితం ప్రారంభించిన సమీకృత (వెజ్, నాన్‌–వెజ్) మార్కెట్ల నిర్మాణ పనులు నత్తకు నడక నేర్పుతున్నాయి. 9 పురపాలికల్లో మొక్కుబడిగా పనులు కొనసాగుతుండగా.. కొంపల్లి, బోడుప్పల్ పురపాలక సంఘాల్లో మాత్రం ప్రారంభ దశలోనే ఉన్నాయి. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా ప్రభుత్వం సమీకృత మార్కెట్ల నిర్మాణాలకు సరిపడా నిధులు విడుదల చేయకపోవడంతో.. పనులు ముందుకు సాగడం లేదు.

మూడేళ్ల క్రితం ప్రారంభం

సమీకృత మార్కెట్ల నిర్మాణానికి దాదాపు మూడేళ్ల క్రితం శ్రీకారం చుట్టారు. వీటి నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించినా, ఆచరణలో సాధ్యం కాని పరిస్థితి నెలకొంది. దీంతో మార్కెట్లను 2022 సంక్రాంతి వరకు వినియోగంలోకి తేవాలని నిర్ణయించినా, నిధుల లేమితో నత్తకు నడక నేర్పుతున్నాయి. జవహర్‌నగర్, బోడుప్పల్, కొంపల్లి, ఘట్‌కేసర్ పురపాలక సంఘాల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. గుండ్లపోచంపల్లి, తూముకుంట, మేడ్చల్, నాగారం, పోచారం, నిజాంపేట్, దుండిగల్ పురపాలక సంఘాల్లో మార్కెట్ల నిర్మాణం నెమ్మదిగా సాగుతుంటే.. పీర్జాదిగూడ, దమ్మాయిగూడలో పనులు ఒక మోస్తరుగా నడుస్తున్నాయి. సమీకృత మార్కెట్ల నిర్మాణాలు సకాలంలో పూర్తయితే నగరశివారు పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు కూరగాయలు, మాంసం, పండ్లు, ఇతర తినుబండారాలు ఒకే చోట లభించనున్నాయి.

స్థలాన్ని బట్టి నిధుల కేటాయింపు..

పురపాలక పట్టణాల్లో ఎకరం నుంచి రెండు ఎకరాల స్థలంలోపు నిర్మించ తలపెట్టిన సమీకృత మార్కెట్లకు రూ.2 కోట్లు, రెండు ఎకరాలు ఆపైన ఉన్న స్థలంలో నిర్మించే సమీకృత మార్కెట్లకు రూ.4.50 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పురపాలిక యంత్రాంగం ఆయా పట్టణాల్లో సమీకృత మార్కెట్ల భవన నిర్మాణ సముదాయాల్లో భాగంగా షెడ్లు, పార్కింగ్ నిర్మాణ వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు చేపట్టనున్నారు.

13 పురపాలిక సంఘాల్లో..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాల్లో సమీకృత మార్కెట్ల కోసం అర ఎకరం నుంచి రెండు ఎకరాల చొప్పున 16.82 ఎకరాల స్థలాన్ని అధికార యంత్రాంగం సేకరించింది. భవనాలు, పార్కింగ్ ఇతర వసతుల పనుల నిమిత్తం ప్రభుత్వం రూ.39.90 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. జవహర్‌నగర్, నిజాంపేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్లలో సమీకృత మార్కెట్ల భవన సముదాయాలు, పార్కింగ్ నిర్మాణం కోసం రూ.4.5 కోట్ల చొప్పున నిధులు కేటాయించింది. మేడ్చల్, గుండ్లపోచంపల్లి, కొంపల్లి, దుండిగల్, తూముకుంట, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లో మార్కెట్ల నిర్మాణానికి రూ.2 కోట్ల చొప్పున నిధులు వెచ్చించనున్నారు.

ఇకపై రాజీవ్ గృహకల్పలో నీటి సమస్య రాదు!

• వాటర్ వర్క్స్ అధికారులు



పంప్‌హౌస్ వద్ద అధికారులు, కాలనీవాసులు

జగద్గిరిగుట్ట: రాజీవ్ గృహ కల్ప నీటి సమస్యపై అధికారులు స్పందించారు. దీంతో ఈ సమస్య పరిష్కరించడానికి చర్యలు చేట్టారు. నీటి సరఫరా అయ్యే వాటర్ ట్యాంక్ వద్ద కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, వాటర్ వర్క్స్ అధికారులు విష్ణు ప్రసాద్, అంకిత్‌తో ఈ సమస్యకు గల కారణాలను తెలుసుకున్నారు. పైప్‌లైన్‌లో పేరుకుపోయిన గులకరాళ్లు, మట్టి పేరుకుపోవడంతో ప్రెషర్ రావడం లేదని గ్రహించి వాటిని తొలగించారు. ఇకముందు గృహకల్ప వాసులకు నీటి సమస్య రాకపోవచ్చని అధికారులు తెలిపారు. తమ సమస్యను బయటకు తీసుకొచ్చిన సందర్భంగా స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

ఎట్టకేలకు స్పందించారు.. చెత్తను తొలగించారు





రోడ్డు మొత్తం శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

జీడిమెట్ల: 'చెత్త రోడ్డు'అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఐలా అధికారులు స్పందించారు. గురువారం జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఏస్వీ కోఆపరేటివ్ సొసైటీకి వెళ్లే రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించారు. అదే విధంగా నాలాలో ఉన్న చెత్తను సైతం తీసేయించారు.

నిజాంపేట్ మేయర్‌కు ఆహ్వానం



మేయర్ నీలారెడ్డిని కలిసి సంక్షేమ సంఘాల సభ్యులు

నిజాంపేట్: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు బతుకమ్మ వేడుకలు ప్రతీకగా నిలుస్తాయని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. గురువారం బాచుపల్లి రైసినియా ఇంటెలిపార్క్ అసోసియేషన్ సభ్యులు, ప్రగతినగర్ వాసులు మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బతుకమ్మ వేడుకలకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కాసాని సుధాకర్ ముదిరాజ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

◆ నిజాంపేట్ 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 2, 3 లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు మేయర్‌కు వినతి పత్రం అందజేశారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సంఘ సేవకుడు జింకల రవితేజకు నివాళి



చెన్నారెడ్డినగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు పంచుతున్న జింకల వెంకటేష్

రంగారెడ్డినగర్: ప్రముఖ సంఘ సేవకుడు, విద్యావంతుడు జింకల రవితేజ జయంతిని గురువారం పంచశీల కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం కుత్బుల్లాపూర్ ఉపాధ్యక్షుడు జింకల వెంకటేష్ హాజరై రవితేజ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం చెన్నారెడ్డి నగర్‌లోని మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, సీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కల్పనా రెడ్డి, సంఘం ఉపాధ్యక్షుడు జింకల వెంకటేష్, ప్రముఖ కవి, మానస టూల్ టెక్ అధినేత వాకిటి రామిరెడ్డి, కుసుమ ఇంజనీరింగ్ వర్క్స్ అధినేత శంకర్, సంఘ సేవకులు రాజేశ్వర్, సూర్యనారాయణ, టి. రమేష్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ఎలక్ట్రిక్ సైకిల్ అందజేత



సైకిల్‌ను అందజేస్తున్న పున్నారెడ్డి, ప్రీతమ్‌రెడ్డి

సుభాష్‌నగర్: దివ్యాంగులకు ఎస్పీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఎల్లవేళలా అండగా ఉంటుందని ట్రస్ట్ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. గురువారం ఆయన కుమారుడు ప్రీతమ్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్న దివ్యాంగుడికి ఎలక్ట్రానిక్ సైకిల్‌ని బహుమతిగా అందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ వినాయక్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలియజేశారు.

◆ ఎన్‌సీఎల్ ఫీడర్ పరిధిలోని కేవీఆర్ ఫంక్షన్‌హాల్ ఏరియా, విజయశాంతి ఎన్‌క్లేవ్, ఎన్‌సీఎల్ నార్త్, శివారెడ్డి గొడౌన్స్, ఎన్‌సీఎల్ స్విమ్మింగ్ పూల్స్, ప్రజయ్ అపార్ట్‌మెంట్స్, మనభూమి ఎన్‌క్లేవ్, వైన్‌సాయ్ అపార్ట్‌మెంట్స్ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు..

◆ అదే విధంగా వైన్‌సాయి ఫీడర్ పరిధిలోని జయభేరి గార్డెన్స్, కేవీఆర్ ఏరియాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

ఉషాముళ్లపూడి సెక్షన్ పరిధిలో...

సుభాష్‌నగర్: విద్యుత్ లైన్ల రీకండక్టరింగ్ పనుల నేపథ్యంలో ఉషాముళ్లపూడి సెక్షన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ చైతన్యభార్గవ్ ఓ ప్రకటనలో తెలిపారు. క్రషర్ ఫీడర్ పరిధిలోని దేవేందర్‌నగర్, పోచమ్మ బస్తీ, జెఎన్ఎన్‌యుఆర్ఎం, లాల్‌సాహెబ్ గూడ, బతుకమ్మబండ, కట్టమైసమ్మ బస్తీ, రావినారాయణరెడ్డినగర్, కైసర్‌నగర్, ఏరో నగర్, వోక్షిత హిల్ వ్యూ, వీనస్ రాక్ హైట్స్, వీనస్ ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఠాగూర్ హైస్కూల్‌లో ఆధార్ సెంటర్ ఏర్పాటు

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లోని ఠాగూర్ హైస్కూల్‌లో గురువారం ఆధార్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ఆధార్ కార్డులో పేర్లు, ఇంటి నంబర్లు మార్పులతో పాటు, కొత్తగా నమోదుతో పాటు ఫోన్ నంబర్‌కు ఆధార్ లింకేజీ వంటి సేవలు పొందవచ్చు. స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

10కిలోల గంజాయి స్వాధీనం

కుత్బుల్లాపూర్: ఓ వ్యక్తి నుంచి పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో గుండ్లపోచంపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఓ వ్యక్తి గంజాయి రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు జొమాటో బ్యాగ్‌తో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న వ్యక్తిని విచారించగా అస్సాంకు చెందిన దీపాంకర్ మేదీగా పేర్కొన్నాడు. తాను రాయదుర్గం మధురానగర్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగిగా పని చేస్తున్నట్లు నమ్మబలికాడు. అతడి బ్యాగ్ తెరిచి చూడగా అందులో 10కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో పోలీసులు దీపాంకర్‌ను ఠాణాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

కుత్బుల్లాపూర్: పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి జయభేరి సమీపంలోని బొబ్బిలి ఎఫైర్స్ ఫ్లాట్‌లో పేకాడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు గురువారం రాత్రి 7గంటల సమయంలో స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాడుతూ ఐదుగురు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోగా వారి వద్ద నుంచి రూ.1,17,970 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

తనిఖీలు ముమ్మరం



జగద్గిరిగుట్టలో సీఐ కాంత్రికుమార్ నేతృత్వంలో తనిఖీలు చేస్తున్న పోలీస్ బృందం

జగద్గిరిగుట్ట: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన ప్రతీ వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించిన అనంతరమే విడిచి పెడుతున్నారు. గురువారం పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పలు కార్లు, ద్విచక్ర వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా డబ్బును తరలిస్తే దానికి సంబంధించిన ఆధారాలు చూపించాలని లేనిపక్షంలో సీజ్ చేస్తామని హెచ్చరించారు.

బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే వివేకానంద్



స్వతంత్ర కార్పొరేటర్ పైడి మాధవిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని.. సీఎం కేసీఆర్ సారథ్యంలో హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ 22వ స్వతంత్ర కార్పొరేటర్ పైడి మాధవి గురువారం ఎమ్మెల్యే వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

◆ రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గురుమూర్తినగర్ శివాలయం, పోచమ్మ ఆలయం, వెంకటేశ్వరాస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు చింతల్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయాల అభివృద్ధికి సహకరిస్తున్న ఆయన్ని శాలువతో సత్కరించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేను తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. శివాలయం కమిటీ చైర్మన్ పి.ఓంకార్‌రెడ్డి, ప్రధాన అర్చకులు ఆంజనేయ శాస్త్రీ, వెంకటేశ్వరా ఆలయ ఉపాధ్యక్షుడు క్రాంతి యాదవ్, పోచమ్మ ఆలయ అధ్యక్షుడు బాలరాజు, ఆంజనేయ ఆలయ కమిటీ అధ్యక్షుడు మురుగేష్ తదితరులు ఉన్నారు.

'బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి'

- జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి
- ఇల్లు రాలేదని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి

నిజాంపేట్: బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు రాలేదని ప్రగతిభవన్ వద్ద ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పకు చెందిన మహేందర్ కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. చివరకు పేదలకు ఇచ్చే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో సైతం మోసం చేసిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్, ప్రధాన కార్యదర్శి నరేంద్ర చౌదరి, ట్రేడర్ సెల్ కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సర్కారు కార్యాలయంలో ప్రభుత్వ ప్రకటన పోస్టర్లు



కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయంలో పోస్టర్లు

చింతల్: ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చి 4 రోజులైనా జలమండలి కార్యాలయంలో ఇంకా కోడ్ ఉల్లంఘనలు కొనసాగుతున్నాయి. కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలోని సబ్ డివిజన్–1, సబ్ డివిజన్–2 కార్యాలయాలకు చెందిన సెక్షన్ల ముంగిట ప్రభుత్వ ప్రకటనలు నేటికి దర్శనమిస్తున్నాయి. గతంలో జలమండలి ఉద్యోగ సంఘాల ఎన్నికలకు సంబంధించిన పోస్టర్లతో పాటు తెలంగాణ ప్రభుత్వానికి చెందిన పలు కేలండర్లు సెక్షన్ కార్యాలయంలో కార్యాలయ లోపల అలాగే దర్శనమిస్తున్నాయి.

ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా బూత్ కమిటీలు కృషి చేయాలి



బూత్ కమిటీల సభ్యులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్

రంగారెడ్డినగర్: రాజ్యాంగ కల్పించిన ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్కరి సద్వినియోగం చేసుకునేలా బూత్ కమిటీ సభ్యులు కృషి చేయాలని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ అన్నారు. గురువారం రంగారెడ్డి నగర్‌లో జరిగిన బీఆర్ఎస్ బూత్ కమిటీ సమావేశంలో రంగారెడ్డినగర్, నెహ్రూనగర్ జీషాన్ బస్తీ, నెహ్రూనగర్, దావూద్ బస్తీ, సంజయ్‌గాంధీనగర్, పంచశీల కాలనీ, చెన్నరెడ్డినగర్ ప్రాంతాల కమిటీల సభ్యులకు కార్పొరేటర్ మార్గనిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి ఓటింగ్ శాతం పెరిగేలా బూత్ కమిటీ సభ్యులు ఇంటింటి ప్రచారం చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో వైఎస్సార్‌టీపీ జెండా ఎగురవేస్తాం



లోటస్ పాండ్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దేశిరెడ్డి సురేష్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్‌లో వైఎస్సార్‌టీపీ జెండాను ఎగుర వేస్తామని నియోజవర్గ కో.ఆర్డినేటర్ దేశిరెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని లోటస్ పాండ్‌లో జరిగిన వైఎస్సార్‌టీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆదేశానుసారం కుత్బుల్లాపూర్‌లో విజయానికి కృషి చేస్తామన్నారు. ఈ ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తులు లేకుండా ముందుకు వెళ్తామని తెలిపారు. తనకు కుత్బుల్లాపూర్ టికెట్ వస్తుందనే నమ్మకముందని ధీమా వ్యక్తం చేశారు.

వన భోజనం కాదు.. మధ్యాహ్న భోజనం!



సుభాష్‌నగర్: నవంబర్ 30న జరగనున్న శాసనసభ ఎన్నికల సందర్భంగా అధికారులు, సిబ్బంది బిజీగా మారారు. ఇటీవల ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో రెవెన్యూ, జీహెచ్ఎంసీ సిబ్బంది కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో రోజువారి పనిలో నిమగ్నమయ్యారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో ఆవరణలో సిబ్బందితో కలసి భోజనం చేస్తుండటం వనభోజనాలను తలపించింది.